స్కెచ్

# టీ కప్పులో తుఫాను

కూరపాటి శ్రీరామ్

ఇంకా ఆరయిందో లేదో వేసవి అవడంమూలాన్న ఎండ పొడుచుకుని వస్తూంది. అయినా, ఇంకా రాజారావు లేవలేదు. ఈ రాజాగాణ్ణి చూస్తుంటే నాకు చాలా తమాషాగా ఉంది. నాలుగురోజులయింది ఇక్కడికి వచ్చి. అయినా ఒక్కసారైనా ఇంటికి పోతానని అనడు. అసలు చిన్నచిన్న విషయాలకి ఇలా పెద్ద రభస చేసే పెద్ద మనుషులను యేమనాలో నాకర్థం కావడంలేదు.

పదిపదిహేను రోజులనించీ నేనూ రాజా కలవడమే కుదిరిందికాదు. అలాటప్పుడు రాత్రి ఏడు గంటలకి-నాలుగురోజులక్రితం,రాజారావడంనాకాశ్చర్యంవేసింది.'ఏమిటి రాజా? ఇలావచ్చావేం?'అడిగాను.తర్వాతచెప్పేడు రాజా తన కారణం.

*　　　*　　　*

ఆవేళ రాజారావు ఆఫీసునుంచి ఇంటికి అయిదు గంటలకి మామూలుగా వచ్చేశాడు. రాగానే సరస్వతితో "చూడు సరూ! వచ్చే సోమవారం నాడుౕరామం పెళ్ళిట. మనల్ని రమ్మని మరీమరీ కోరుతూ ఉత్తరం రాశాడు. వస్తావు కదూ! మనం తప్పక వెళ్ళాలి" అన్నాడు.

"రామమా? ఏ రామం? ఎవరూ? మీరు చెప్పేదేదీ నాకర్థం కావడంలేదు. అందరికీ అర్థమయేటట్లు మాట్లాడ్డం మీకెప్పుడలవడుతుందో గదా" అంది సరస్వతి నవ్వుతూ,

"బాగుబాగు. రామం తెలీదా!మా మామయ్య తోడల్లుడి తమ్ముడి కొడుకు. మన పెళ్ళిలోకూడా నా తరఫు నానా హంగామా చేసేడే—వాడి పెళ్ళి అర్థమయిందా ఇప్పుడు?"

"సరి తెలిసింది. కాని నేను మాత్రం రాను. ఆ పెళ్ళికి ఛస్తే రాను," సరస్వతి అదేదో తనిదివరకే నిర్ధారణ చేసుకున్నట్లు అంది.

రాజా అదిరిపడ్డాడు:"ఏం ఎందుకురావూ?తప్పకుండారావాలి. ఇది నీ ఇష్టంకాదు తెలుసా?నువ్వెందుకురావో చూస్తాకదా? తమాషాకున్నావా యేం?"

"తమాషామాత్రం కాదు. నేనుమట్టుకు రాను" అని ఒక నిమిషం ఆగి, "మొన్నమట్టుకు మొన్న మా నాన్నకి అస్వస్థతగా ఉందని ఉత్తరం వఁస్తే మీరేమన్నారు? 'నాకు వీలులేదు: ఆఫీసులో సెలవు దొరకదు. ఇంత అర్జంటుగా ఉత్తరాలు రాస్తే ఇదేమన్నా గవర్నమెంటు నౌకరీయా లేకపోతే మరేమిటో అనుకున్నాడా మీ నాన్నకిమాత్రం బుద్ధి ఉండొద్దూ?" అని అన్నారే! అప్పుడు దొరకని సెలవు ఇపుడు దొరికిందా? దొరికిందే అనుకోండి.

మరి రెణ్ణెల్లక్రితం మా పినతల్లికూతురు సుబ్బులు పెళ్ళికి రమ్మన్నా సెలవు దొరకలేదని నీ కిష్టమైతే నువ్వొక్కత్తవే వెళ్లు అని అన్నారే నేనెన్ని చెప్పినా వినిపించుకోకుండా. సుబ్బులూ, నేనూ ఒకేతల్లి పిల్లల్లాగ పెరిగేమే! నేనొక్కదాన్నే యెలా వెడతానసే ధీమాతో అలా అనగలిగేరు?

నిన్న సాయంకాలం సినిమాకి రమ్మంటే ఏడింటికి ఇంటికివచ్చి మరో కుంటిసాకా? ఇలాటప్పుడు యెక్కడో మీ మామయ్య తోడల్లుడి తమ్ముడి కొడుకు పెళ్ళికి నే మాత్రం యెలా వస్తాను? నేను రానుగాకరాను" అంటూ ముగించింది సరూ.

రాజాకి ప్రపంచమే తలక్రిందులైనట్లనిపించింది. ఇన్నాళ్ళూ ఏ విషయానికీ పల్లెత్తుమాటకూడా యెదురాడని సరూ యిలాగ యెదురు తిరగడం రాజాకి నచ్చలేదు. సరూలోని ఆవేశం ఉడుకెత్తిన లావాలాగ ద్రవించడం చూస్తే రాజాకి ఆశ్చర్యంవేసింది. ష్రీడరుగారి అమ్మాయికి ఎదురాడడం చేతగాక అతన్ని అవమానం ఆవరించింది. అతని మానవత్వం అవధులుదాటి పోయింది.

ఏమైనా తను మగాడు కాబట్టి మగత్వం రుజువుచేసుకుందుకు సరూపై చేయిజేసుకున్నాడు. అంతే! "ఛీ ఛీ, ఈ ఇంటికన్నా నరకంనయం, నేనుచెప్పే ఏ మాటా నువ్వు లెక్కచెయ్యడం లేదు" అంటూ బయటికి వచ్చేశాడు.

రాజా లేచాడు. లేవడంతోటే "ప్రకాశం ఇంటికి వెళ్ళాలిరా" అన్నాడు. నేను ముభావంగా "ఔను"అన్నాను.

"ఏమిట్రా ఔనంటావు. ఇంటికి వెళ్ళాలంటే మార్గం యేదో నాకు చూపించు."

"బావుంది! నీ ఇంటికి వెళ్ళే దోవను నువ్వే మరచిపోయావుట్రా దద్దమ్మా!"

"కాదురా! దోవ తెలీకనికాదు. నిన్ననో పీడ కల వచ్చింది. ఇంటికివెళ్ళి దాన్ని తప్పక చూడాలిరా!"

"అంత ఇది ఉండేవాడివి చప్పున ఇక్కడికెలా వచ్చేశావు? నాలుగు రోజులుగా ఊరుకుని ఇప్పుడు చూడాలనుకుంటున్నావా? బావుంది నాయనా బావుంది! వెళ్ళి చూడు...అవునుగానీ నీ ముఖం ఎలా చూపుతావురా ఆవిడకి?"

"దానికే నిన్నక్కడ కెళ్ళి ఏదో చూడమన్నాను. బాబ్బాబూ!"

నేను నవ్వి ఊరుకున్నాను.

* * *

స్నానంచేసి వాళ్ళింటికివెళ్ళి, "అమ్మా సరూ! రాజా ఉన్నాడా?" అంటూ నంగనాచిలా అడిగాను. వెంటనే ఆమె కంటతడిబెట్టి "లేరన్నయ్యా! నాలుగు రోజులు క్రితం యేదో కోపంవచ్చి పోవడం పోవడం అలా పోయారు. మళ్ళీరాలేదు. నాకేం తోచడంలేదు. మీరే కాస్త ఎక్కడున్నారో పట్టుకోవాలండీ శ్రమ అనుకోకుండా," అందామె.

"ఆఁ! కోపంవచ్చి నాలుగు రోజులనించీ ఇంటికి రావడంలేదూ? అదేమిటమ్మా వీడికి మరీ కుర్రదనం యెక్కువవుతోంది. ఏదో ఇట్లో కీచులాటయితే ఇలా చేస్తాడా? ఇలా చేస్తాడా అంట" అని నేను ఏదో ఆశ్చర్యపోతునట్లన్నాను.

"ఏంచేస్తాం చెప్పండి. అయిందేదో అయింది. నాకు బుద్ధివచ్చిందని చెప్పి మరీ తీసుకురండి ఆయన ఎక్కడైనా కనబడితే," అందామె కన్నీళ్లు పెట్టుకుంటూ.

"ఛా ఛా అదేమిటమ్మా అపని!? నేనున్నానుగా అంతాసరిజేస్తాను," అంటూ ఓ పెద్దమనిషిలా బయటికివచ్చాను.

ఆఫీసుకి వెళ్ళాను. లంచ్‌లో రాజారావుతో "ఏమిటిరాజా ఇది? పాపం ఆవిడ నీగురించి ఎంత దుఃఖిస్తున్నదో తెలుసా? ఇలాంటిపని మరెప్పుడూ చెయ్యబోకు. చేస్తే చెవి మెలేస్తా" అని నవ్వుతూ మందలించాను.

రాజా "అబ్బే మరేంలేదురా! అంతా నాదే తప్పు. ఎంచేతనంటే వాళ్ళపినతల్లి కూతురు పెళ్ళికి వెళ్ళడానికి ఆ సమయంలో నా దగ్గర డబ్బులేక పోయింది. అప్పుడు నిన్నడుగుదామంటే నువ్వూ వూళ్ళో లేవు. మరేం చేసేది? నాదగ్గర డబ్బు లేదు;అంచేత రానుఅంటే ఎంత చిన్నతనంచూడూ! అందువల్ల సెలవు దొరకలేదని సాకుచెప్పాను."

వాళ్ల నాన్నగారికి అస్వస్థతగా నున్నప్పుడు పండక్కి కాకుండా మావగారి వంట్లో ఏదో బాగుండలేదని వెడితే అందులో మజా యేంఉంది అని అప్పుడూ సెలవు దొరకలేదని సాకు చెప్పాను మొన్న సినిమాకీ వెళ్ళడం విషయమే మరచి పోయాడు.

పాపం అన్నీ కలసి దాన్ని బాధించిఉంటాయి అందుకనీ అలా మాట్లాడి ఉంటుంది. అదే కాకుండా ఈ రామం పెళ్ళి అంత వెళ్లవలసిన అవసరం కలదికూడా కాదు. నేను నిజంగా మొండి పట్టుపట్టి దాన్నలా బాధ పెట్టాన్రా! పాపం! ఎంతగా చింతిస్తోందో." అన్నాడు విచారంగా.

"ఒరే అబ్బే, అలాంటి వెర్రిమొర్రివేషాలు మరెప్పుడూ వెయ్యక ఆఫీసు వదలగానే మాట్లాడకుండా ఇంటికి వెళ్ళి క్షమార్పణ జెప్పుకో. నీ కోసం ఆవిడ ఎంతో ప్రయత్నం చేస్తూంటూంది" అంటూ లంచ్ అవగానే లోపలికి వెళిపోయాను.

మర్నాడు ఇంకో స్నేహితుడిని దిగపెట్టడానికి స్టేషనుకి వెడితే సెకండుక్లాసు కంపార్టుమెంటు తలుపు నానుకుని సరూతో మాటాడుతున్న రాజు కనపడ్డాడు. ఆశ్చర్యపోయాను. "అరే రాజా! ఏం ఎక్కడికి వెడుతున్నావేమిటి?" అని ప్రశ్నించాను.

"రామవరం వెడుతున్నానోయ్! సి. ఎల్. వారంరోజులు పెట్టాను" అన్నాడు రాజా.

"అరె! మావగారి ఊరికి వెళ్ళడానికి సెలవు దొరికిందా? ఊఁ! వెళ్ళబాబూ వెళ్లు" అంటూ నేను నవ్వుతుంటే రాజా నవ్వు ఇంజను కూతలో కలసి పోయింది. ★